31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
శనివారం, జూలై 25, 2026
పేజీలు : 8

## నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**-జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్**
**-కథలాపూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 24 :** నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ అధికారులను ఆదేశించారు. కథలాపూర్ పోలీస్ స్టేషన్ను శుక్రవారం జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, పెండింగ్

2లో

### భూ భారతి రీ-సర్వేతో...

## భూముల హక్కులకు శాశ్వత భద్రత

**-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 24 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి రీ-సర్వే కార్యక్రమంపై కోరుట్ల మండలం సంగెం గ్రామంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని రైతులకు, గ్రామ ప్రజలకు రీ-సర్వే విధానంపై వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతిలో కొలిచి కొత్త డిజిటల్ మ్యాపులు రూపొందిస్తామని తెలిపారు. ముందుగా గ్రామ సరిహద్దులు, అనంతరం గ్రామ కంఠం (ఇళ్ల ప్రాంతం), ప్రభుత్వ భూములు, చివరగా పట్టా భూముల రీ-సర్వే చేపడతామని చెప్పారు. పట్టా భూముల సర్వేకు ముందు ప్రతి రైతుకు భూ భారతి చట్టం ప్రకారం 9(1) నోటీసు జారీ చేసి తేదీ, సమయం తెలియజేస్తామని, ఆ రోజున రైతులు తమ భూమి వద్ద తప్పనిసరిగా హాజరై హద్దులను చూపించి సర్వే బృందానికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఈ రీ-సర్వే ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గి, ప్రతి భూయజమానికి స్పష్టమైన హక్కులు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం పారదర్శకంగా వేగంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా సంగెం గ్రామంలో పంచాయతీ భవనం, వీవో భవనం, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న వీవో భవనాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో, రెవెన్యూ అధికారులు, సర్వేయర్ కుమారస్వామి, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



### శుద్ధ జలంలో నాణ్యత ప్రమాణాలను

## ఖచ్చితంగా పాటించాలి



**- జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)రాజా గౌడ్**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (24) :** ప్రజలకు అందించే ప్రతి చుక్క తాగునీరు సురక్షితంగా, నాణ్యంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాజా గౌడ్ సూచించారు. శుద్ధ జలాల సరఫరాలో నాణ్యత ప్రమాణాలు, నిర్వహణ విధానాలు, నీటి పరీక్షల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్‌ను సంబంధిత శాఖ అధికారులతో కలిసి ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ప్లాంట్‌లోని శుద్ధి ప్రక్రియ, నీటి నిల్వ, పంపింగ్ వ్యవస్థ, వాటర్ గ్రిడ్ ద్వారా గ్రామాలకు జరుగుతున్న తాగునీటి సరఫరా విధానాన్ని పరిశీలించి

2లో

### కాల్పుల ఘటన మిస్టరీ

## ఛేదించిన మెట్ పల్లి పోలీసులు

**-ఆస్తి వివాదమే కారణం -సుపారీ ఇచ్చి సొంత వదినపైనే హత్యాయత్నం**
**-ఉత్తరప్రదేశ్ నుంచి పిస్టల్ కొనుగోలు-నలుగురు నిందితుల అరెస్ట్**
**-పిస్టల్, రెండు సజీవ కార్ట్రిడ్జీలు, మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్లు స్వాధీనం**




**చురకలు విలేకరి,మెట్‌పల్లి, జూలై 24 :** మెట్‌పల్లి పట్టణంలో ఇటీవల సంచలనం సృష్టించిన కాల్పుల ఘటనను పోలీసులు సమర్థవంతంగా ఛేదించారు. కుటుంబంలోని ఆస్తి వివాదాల కారణంగానే సొంత వదినను అంతమొందించేందుకు ముందస్తు పథకం ప్రకారం హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ప్రధాన కుట్రదారు లతో సహా

2లో



## కోరుట్ల ఎస్ఐ చిరంజీవి సస్పెన్షన్

**-విధుల్లో నిర్లక్ష్యంపై ఉన్నతాధికారుల చర్యలు**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 24** : జగిత్యాల జిల్లా కోరుట్ల పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ చిరంజీవిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇటీవల హత్యకు గురైన కర్రె సునీత గతంలో తనపై దాడి చేసిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహ రించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## కౌన్సిలర్ వేధింపులు

## రిటైర్డ్ ఎస్సై కుటుంబం ఆవేదన

**-మురికి కాలువ అంశంపై వివాదం..**

**న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 24** : జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని డాగ్ బంగ్లా ప్రాంతంలో ఇంటి ముందు ఉన్న మురికి కాలువ సమస్య విషయంలో స్థానిక 32వ వార్డు కౌన్సిలర్ వసీ ఉర్ రెహమాన్ వసీం తమను వేధిస్తున్నారని రిటైర్డ్ ఎస్సై సయ్యద్ హషం, ఆయన భార్య కనిస్ ఫాతిమా ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటి ముందు ఉన్న కాలువ విషయమై కౌన్సిలర్ అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, రూ.25 వేల రూపాయలు ఇస్తే కాలువను అలాగే ఉంచుతామని, లేదంటే స్థలాన్ని ఆక్రమించి ఇబ్బందులకు గురి చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని కనిస్ ఫాతిమా ఆరోపించారు. తాము ఎన్నో సంవత్సరాలుగా అదే ఇంటిలో నివసిస్తున్నప్పటికీ, ఇటీవల కాలంలో కావాలనే ఒత్తిడి తెచ్చి మానసికంగా వేధిస్తున్నారని ఆమె తెలిపారు. ప్రజాప్రతినిధిగా సమస్యలను పరిష్కరించాల్సిన కౌన్సిలర్, తమపై అనవసర ఒత్తిడి తీసుకురావడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని రిటైర్డ్ ఎస్సై కుటుంబం విజ్ఞప్తి చేసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

## మంథనిలో పరామర్శ



**చురకలు ప్రతినిధి,మంథని, జూలై 24** : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అసెంబ్లీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు సహోదరి శ్రీమతి సువర్ణ వనమాల ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం మంథని పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సువర్ణ వనమాల సేవలను, మంచితనాన్ని గుర్తుచేసుకున్న మంత్రి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే విషాదంలో ఉన్న కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాల్పుల ఘటన మిస్టరీ ఛేదించిన మెట్‌పల్లి పోలీసులు

**మొదటి పేజీ తరువాయి...**
నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి హత్యాయత్నానికి ఉపయోగించిన ఒక నాటు పిస్టల్, రెండు సజీవ కాట్రిడ్జీలు, ఒక మోటార్ సైకిల్, ఒక మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ?పోలీసు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన గోనెల శంకర్ అలియాస్ జేసీబీ శంకర్ (ఎ-1), గోనెల రాజం సొంత అన్నదమ్ములు. వీరి మధ్య వ్యవసాయ భూమి, నివాస గృహానికి సంబంధించి చాలా కాలంగా వివాదాలు నడుస్తున్నాయి. శంకర్ తన భార్య అనూష (ఎ-2) పేరు మీద కుటుంబ సభ్యులకు తెలియకుండా 58 గుంటల భూమిని విక్రయించడంతో పాటు, ఇంటిని కూడా ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై రాజం, ఆయన భార్య గోనెల లక్ష్మి తమ వాటా కావాలని నిలదీయడంతో విభేదాలు తీవ్రమయ్యాయి. గతంలో కూడా లక్ష్మి దంపతులపై దాడి జరగగా మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. లక్ష్మి అడ్డు తొలగించుకుంటే తప్ప ఆస్తి మొత్తం తమకు దక్కదని భావించిన శంకర్, అనూషతో పాటు వారి బంధువు గోపి




ముత్తయ్య (ఎ-3) కలిసి ఆమెను హత్య చేయడానికి కుట్ర పన్నారు.

**సుపారీ ఒప్పందం, యూపీ నుంచి పిస్టల్ కొనుగోలు..**

తన వద్ద జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్ కుమార్ అలియాస్ సచిన్ వర్మ (ఎ-4) ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకుని, అతనికి భారీ మొత్తంలో డబ్బుతో పాటు సౌదీ అరేబియా వెళ్లేందుకు ఆర్థిక సాయం అందిస్తామని ఆశ చూపి లక్ష్మిని హత్య చేసేందుకు ఒప్పించారు. ?పథకం ప్రకారం సచిన్ 2026 మార్చిలో ఉత్తరప్రదేశ్ వెళ్లి ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద ఓ సాధువు వద్ద రూ.40,వేల రూపాయలకు ఒక నాటు పిస్టల్, మూడు కాట్రిడ్జీలు కొనుగోలు చేశాడు. దీనికి శంకర్ ఫోన్‌పే ద్వారా రూ. 35,000 పంపించాడు. మార్చి 10న ఆ ఆయుధాలను మెట్‌పల్లికి తీసుకొచ్చారు. ?అర్ధరాత్రి వేళ దారుణం పోలీసులను తప్పుదోవ పట్టించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్న నిందితులు, జూన్ 15న అర్ధరాత్రి 1:30 గంటల ప్రాంతంలో అమలు చేశారు. సచిన్ వర్మ ముఖానికి రుమాలు కట్టుకుని, బైక్‌పై లక్ష్మి ఇంటికి వెళ్లి వరండాలో నిద్రిస్తున్న లక్ష్మిపై నాటు పిస్టల్‌తో కాల్పులు జరిపాడు. అయితే బుల్లెట్ లక్ష్యం తప్పి ఆమె ఎడమ చెంపకు తగలడంతో ప్రాణాపాయం తప్పింది. కాల్పుల అనంతరం నిందితులు ఈ ఘటనను దోపిడీదారులు లేదా గుర్తుతెలియని వ్యక్తులు చేసిన దాడిగా చిత్రీకరించేందుకు నాటకమాడారు.

**దర్యాప్తు చేపట్టి నిందితుల అరెస్ట్..**

బాధితురాలికి శస్త్రచికిత్స చేసి బుల్లెట్ బయటకు తీయడంతో కేసు కీలక మలుపు తిరిగింది. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఎ. రాములు పర్యవేక్షణలో సిఐ బి.సురేష్ బాబు, ఎస్ఐ పి. కిరణ్ కుమార్ బృందం రంగంలోకి దిగింది. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, ఆర్థిక లావాదేవీలను విశ్లేషించి కేసును ఛేదించారు. ?ఎ-1 గోనెల శంకర్, ఎ-3 గోపి ముత్తయ్యలను జూన్ 16న,?ఎ-2 గోనెల అనూషను జూన్ 28న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ఎ-4 సచిన్ కుమార్‌ను జూలై 20న ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై గురువారం మెట్‌పల్లికి తీసుకొచ్చి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారు. సాహసోపేతంగా అంతర్రాష్ట్ర దర్యాప్తు జరిపి కేసును ఛేదించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# బాసర వ్యాస పూర్ణిమ ఉత్సవాలకు ఎస్పీకి ఆహ్వానం

**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై 24** : నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించనున్న వ్యాస పూర్ణిమ ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ బాసర ఆలయ ఈఓ అంజనీ దేవి, స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ఉప ప్రధానాచార్యులు శ్రీపాద్ దీక్షితులు జిల్లా ఎస్పీ.జానకి షర్మిలని మర్యాదపూర్వకంగా కలిసి



ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు జిల్లా ఎస్పీకి వ్యాస పూర్ణిమ ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలతో ఆశీర్వదించి, వ్యాస పూర్ణిమ ఉత్సవాల ఆధ్యాత్మిక, వైదిక విశిష్టతను వివరించారు. ఉత్సవాలకు విచ్చేసి అమ్మవారి దర్శనం చేసుకోవాలని కోరారు. జిల్లా ఎస్పీ.జానకి షర్మిల వారి ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించి, ఆలయ అధికారులు, వేద పండితులకు కృతజ్ఞతలు తెలిపారు

## శుద్ధ జలంలో నాణ్యత ప్రమాణాలను...

**మొదటి పేజీ తరువాయి...**
అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్‌లో నిర్వహిస్తున్న నీటి నాణ్యత పరీక్షలు, ప్రయోగశాల పనితీరు, క్లోరినేషన్ ప్రక్రియ, నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందించే నీరు భారత ప్రభుత్వ తాగునీటి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిరంతర పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా నాణ్యతలో లోపాలు గుర్తించిన వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయం తో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మిషన్ భగీరథ ద్వారా



అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ ఎం. జానకి, ఎంపీడీఓ సీహెచ్. గణేష్, తహశీల్దార్ వరప్రసాద్, ఎంపీఓ రామకృష్ణరాజు, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈఈ బి. మల్లేష్, ఏఈఈలు ఎ. వింధ్యరాణి, పి. జ్ఞానేశ్వర్, పి. లత, మెగా ప్రాజెక్టు మేనేజర్ నాగరాజు, సర్పంచ్ పుప్పాల లక్ష్మి, ఉపసర్పంచ్ మహేష్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**మొదటి పేజీ తరువాయి...**
కేసుల దర్యాప్తు, తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చె శారు. స్టేషన్ లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం




చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను మర్యాద పూర్వకంగా స్వీకరించి, చట్టపరంగా వెంటనే స్పందించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో అత్యంత సున్నితంగా వ్యవహరించాలని, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ, గ్రామాలు మరియు పట్టణాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ను మరింత పెంచాలని, రాత్రి పూట పెట్రోలింగ్ను సమర్థవంతంగా నిర్వహించాలని, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ నారాయణ, ఎస్.ఐ రవి కిరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ లక్ష్మీనర్సుకు పరామర్శ

**- క్షేమ సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీపీ నెరెళ్ళ దేవేందర్, సర్పంచ్ కనుక నాగేష్**



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (24) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ జంబుక లక్ష్మీ నర్సు ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్ఓగా విధులు నిర్వహిస్తున్న సమయంలో అస్వస్థతకు గురై అనారోగ్యానికి లోనయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీ నర్సుకు రెండు రోజుల క్రితం వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసు కునేందుకు మాజీ ఎంపీపీ నెరెళ్ళ దేవేందర్, గ్రామ సర్పంచ్ కనుక నాగేష్ హైదరాబాద్‌లోని అవని హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. వైద్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుని, లక్ష్మీ నర్సు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పడంతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## 23.65 కోట్లతో కోర్టు భవనాలు..

## రెండు నెలల్లో పూర్తి : జువ్వాడి కృష్ణారావు



చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 24 : కోరుట్ల పట్టణంలో రూ.23 కోట్ల 65 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన కోర్టు భవనాల సముదాయం మరో రెండు నెలల్లో పూర్తవుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ న్యాయవాదులు కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్మాణంలో ఉన్న కోర్టు భవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి రత్నాకర్ రావు హయాంలో కోరుట్లకు న్యాయస్థానం వచ్చినప్పటికీ సొంత భవనం లేక న్యాయవాదులు సిబ్బంది కక్షిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి అన్ని సౌకర్యాలతో కూడిన నూతన కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా, 2024లో రూ.23.65 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.అదే ఏడాది ఆగస్టులో టెండర్ల ప్రక్రియ పూర్తై నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని,వచ్చే ఆగస్టు నెలాఖరు నాటికి భవన నిర్మాణం పూర్తవుతుందని వెల్లడించారు.ఈ కార్యక్రమం లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్,కోరుట్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం,కాంగ్రెస్ నాయకుడు పుప్పాల ప్రభాకర్,స్థానిక న్యాయవాదులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



చురకలు విలేకరి, రాయికల్, జూలై 24: బి.ఆర్.యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన సందర్భంగా బుధవారం రాయికల్ పట్టణంలోని స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పనులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి, మండల,పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్,ఎలిగేటి అనిల్,ఆంజనేయ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, కౌన్సిలర్ భూక్య రాకేష్ నాయక్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ విద్యుత్ సేవా వాహనం ద్వారా సమస్యలకు తక్షణ పరిష్కారం

**-విద్యుత్ శాఖ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాం**

**-జగిత్యాల విద్యుత్ శాఖ ఎస్ఈ సుదర్శనం**



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (24) : విద్యుత్ వినియోగ దారులకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో మొబైల్ విద్యుత్ సేవా వాహనాన్ని అందుబాటు లోకి తీసుకొచ్చామని జగిత్యాల జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్ఈ సుదర్శనం అన్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మేడిపల్లి గ్రామంలో శు క్రవారం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా మొబైల్ విద్యుత్ సేవా వాహనాన్ని సీజీఆర్ఎఫ్ చైర్మన్ చవాన్ జైవంత్ రావు, టెక్నికల్ ఫైనాన్స్ మెంబర్ పి. శ్రీనివాస్, టెక్నికల్ డీఈ గంగారాం, మెట్‌పల్లి డివిజన్ డీఈ మధుసూదన్ సంయుక్తం గా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఈ సుదర్శనం మాట్లాడుతూ, విద్యుత్ శాఖ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో మొబైల్ విద్యుత్ సేవా వాహనాన్ని ప్రవేశపెట్టామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను కార్యాలయాల చుట్టూ తిరగకుండా క్షేత్రస్థాయిలోనే గుర్తించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరిం చేందుకు ఈ వాహనం దోహదపడు తుందన్నారు.విద్యుత్ బిల్లులు, కొత్త కనెక్షన్లు, పేరు మార్పులు,మీటర్ లోపాలు,తక్కువ వోల్టేజ్,తరచూ విద్యుత్ అంతరాయం, ట్రాన్స్‌ఫార్మర్ సంబంధిత సమస్యలు, విద్యుత్ లైన్ల లోపాలు వంటి పలు సమస్యలపై ప్రజలు ఈ సేవా వాహనం ద్వారా నేరుగా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని, ఫిర్యాదులను శాఖ అధికారులు వెంటనే పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈకార్యక్రమంలో ఏఈలు ప్రశాంత్, సతిష్, కమర్షియల్ ఏఈ శివ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిష్కార వేదిక ద్వారా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం

**- సీజీఆర్ఎఫ్ చైర్మన్ చవాన్ జైవంత్ రావు**



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (24) : విద్యుత్ వినియోగ దారులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) సమర్థవంతంగా పనిచేస్తోందని సీజీఆర్ఎఫ్ చైర్మన్ చవాన్ జైవంత్ రావు తెలిపారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మేడిపల్లి గ్రామంలో శు క్రవారం 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల నుంచి వివిధ సమస్యలు, ఫిర్యాదులు, సూచనలను స్వీకరించిన అధికారులు వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యుత్ సరఫరా, కొత్త కనెక్షన్లు,బిల్లింగ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, విద్యుత్ లైన్ల మరమ్మతులు తదితర అంశాలపై వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వినియోగదారులు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసి పరిష్కారం పొందేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని చవాన్ జైవంత్ రావు పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని,ఫిర్యాదుల పరిష్కారం లో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.ఈకార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ టెక్నికల్ ఫైనాన్స్ మెంబర్ పి. శ్రీనివాస్,జగిత్యాల సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) సుదర్శనం,టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్ గంగారాం, మెట్‌పల్లి డివిజన్ డీఈ మధుసూదన్, విద్యుత్ శాఖ అధికారులు ప్రశాంత్,సతిష్ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమంగా తరలిస్తున్న

## మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**- అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు**

**- ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేల జరిమానా**



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (24) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు.ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలి స్తున్న మూడు ట్రాక్టర్లను శుక్ర వారం పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్, జీపీఓ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం, మల్లాపూర్ మండలంలోని నడికూడ,మెగిలిపేట గ్రామాల నుంచి ఫకీర్‌కొండాపూర్, యామాపూర్ గ్రామాలకు ప్రతిరోజూ అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం తో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన అధికారులు తనిఖీలు నిర్వహించి మూడు ట్రాక్టర్లను పట్టుకు న్నారు.పట్టుబడిన ట్రాక్టర్లను ఇబ్రహీం పట్నంమండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి తహసీల్దార్ వరప్రసాద్ ఎదుట హాజరు పరిచారు. నిబంధనలు ఉల్లంఘించి నందుకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.అక్రమ ఇసుక రవాణాపై నిరంతర నిఘా కొనసాగు తుందని, నిబంధనలను ఉల్లంఘించి ఇసుకను అక్రమంగా తరలిస్తే ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని తహశీల్దార్ హెచ్చరించారు.

## ఉపాధ్యాయుల ముఖ హాజరు తప్పనిసరి



**-ఎంఈవో గంగుల నరేశం**

చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై 24 : కోరుట్ల మండల వనరుల కేంద్రం లో శుక్రవారం మండల స్థాయి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి (ఎంఈవో) గంగుల నరేశం మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ హాజరును ప్రతిరోజూ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజన యాప్‌లో విద్యార్థుల హాజరు నమోదు, యుడైస్ లో విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ గంగాధర్, సునావత్ రాజు, జె. సత్యనారాయణలను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వి. గంగాధర్, ఎస్. జోస్నా, భారతి, సీఆర్‌పీలు పి. గంగాధర్, మాన్విత, జ్యోతి, దేవేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల కోసం వెల్ నెస్ సెంటర్ మంజూరు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 24 :** జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉద్యోగులు మరియు విశ్రాంత ఉద్యోగుల కోసం వెల్ నెస్ సెంటర్ మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శుక్రవారం వారి కార్యాలయం లో కలిసి వినతి పత్రాన్ని అందజేయగా స్పందించిన మంత్రి వెల్ నెస్ సెంటర్ మంజూరు చేస్తామని, సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం ఉందని అట్టి సమావేశానికి హాజరు కావాలని కోరారని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. ఇట్టి విషయంలో వెల్ నెస్ సెంటర్ కొరకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్కు తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కరబూజ రవీందర్, కార్యదర్శి కొలిచాల రవీందర్, ఆర్థిక కార్య దర్శి గుండేటి గంగాధర్, అర్బన్ అధ్యక్షులు మెట్ట మల్లికార్జున్, కార్యదర్శి కంటె అంజయ్య, ఆర్థిక కార్యదర్శి వేల్పుల ప్రతాప్ మరియు జిల్లా, అర్బన్ యూనిట్ కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత



**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 24 :** ధర్మపురి మండలానికి జాగటి మహేష్ గత ఐదు రోజుల క్రితం మహారాష్ట్ర ముంబై లో అనారోగ్యంతో మృతి చెందాడు. కొన్ని సంవత్సరాలుగా ముంబై నగరంలో డ్రైవర్ గా జీవనోపాధి పొందుతు అనారోగ్యం బారిన పడ్డాడు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామ సర్పంచ్ గుర్రపు రేఖ గ్రామస్తుల సహకారం తో చందాలు ప్రోగుచేసి మృతదేహాన్ని స్వగ్రామం శుక్రవారం తీసుకవచ్చారు. అతనికి భార్య పద్మ గృహిణి ఆరేళ్ళ కూతురు ఉన్నారు. వారి పరిస్థితి అర్థం చేసుకొని సర్పంచ్ గుర్రపు రేఖ కొమురయ్య దహన సంస్కారాల నిమిత్తం 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. మరింత మంది దాతలు వారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## నేడు జిల్లాలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటన

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 24 :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఉదయం హైదరాబాద్లోని మాదినగూడ, మియాపూర్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి, కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12.00 గంటలకు జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం చింతలపేట గ్రామానికి చేరుకుని, ఇటీవల హత్యకు గురైన కర్రె సునీత కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చనున్నారు. తదుపరి మధ్యాహ్న భోజన విరామం అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం రహీంకాన్ పేట గ్రామానికి బయలుదేరి వెళ్తారని అధికారులు తెలిపారు.

# వేర్ హౌసింగ్ చట్టంపై రైతులకు అవగాహన



**చురకలు విలేకరి, కొడిమ్యాల, జూలై 24 :** కొడిమ్యాల మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతు వేదిక కార్యాలయంలో శుక్రవారం వేర్ హౌసింగ్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు మేనేని రాజనర్సింగరావు అధ్యక్షతన సహకార శాఖ అధికారి సీనియర్ అసిస్టెంట్ స్వప్న,మాజీ చైర్మన్ గుడి మల్లికార్జున్ రెడ్డి, హైదరాబాద్కు చెందిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ కోపరేటివ్ మేనేజ్మెంట్ (ఐసిఎం) డైరెక్టర్ శ్యాం కుమార్ ఆధ్వర్యంలో సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డబ్ల్యూడీఆర్ఎ చట్టం లక్ష్యాలు, గిడ్డంగులు నమోదు విధానం, వేర్ హౌస్ ద్వారా రైతులకు లభించే ప్రయోజనాలు, పంట నిల్వ విధానం, బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవసరం పై నిపుణులు సమగ్రంగా వివరించారు.గుర్తింపు పొందిన గిడ్డంగుల్లో పంట నిలువ ఉంచడం ద్వారా అనుకూల ధర వచ్చేవరకు వేచి ఉండవచ్చని, గిడ్డంగు రసీదు ఆధారంగా బ్యాంకు నుండి సులభంగా రుణాలు పొందవచ్చని తెలిపారు. రైతులు డబ్ల్యూడీఆర్ఎ చట్టంలోని నిబంధనలను తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు అడిగిన సమస్యలకు నిపుణులు సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సహాయ అధికారి, సంఘ కార్యదర్శి వోడ్నాల గంగాధర్, డైరెక్టర్ ఈరు శంకరయ్య, రమేష్, గంగరాజం, రైతులు, సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నీట్ పేపర్ లీక్, రాహుల్ గాంధీ అరెస్టుకు

# నిరసనగా విద్యాసంస్థల బంద్




**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 24 :** కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటన, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం ధర్మపురి పట్టణంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్ఎస్ఈ యూఐ నాయకులు, విద్యార్థులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నీట్ పేపర్ లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎన్ఎస్ఈయూఐ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షుడు అప్పం శ్రావణ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించాలని, నీట్ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అప్పం తిరుపతి, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సాయి, కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ విజయబాబు, వొజ్జల లక్ష్మణ్, ప్రశాంత్, సుముక్, కాశెట్టి రాజు, జంజీర్ కాని గణేష్, పోశయ్య, దొనకొండ నరేష్, రమేష్, అరవింద్, ఎన్ఎసయూఐ మండల అధ్యక్షుడు యశోద జశ్వంత్, ఎన్ఎస్ఈయూఐ మాజీ నాయకుడు సింహారాజ్ ప్రసాద్, ఎన్ఎస్ యూఐ నాయకులు ముజెమిల్, హెచ్. సాయి, సాయి వినయ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలల బంద్ విజయవంతం



**చురకలు విలేకరి, రాయికల్ జూలై 24 :** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీ చార్జ్ లతో గాయపడిన విద్యార్థులకు మద్దతుగా, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం ఎన్ఎస్ యు ఐ,యూత్ కాంగ్రెస్ బందు పిలుపుమేరకు రాయికల్ పట్టణంలోని జూనియర్ కళాశాలల బందు విజయవంతమైంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజ్ కి కారకులైన వారిపై అదేవిధంగా లీకేజ్ గా నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ కేంద్రంగా విద్యార్థులు జంతర్ మంతర్లో ధర్నా చేస్తుంటే విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడం అత్యంత దారుణమని బాధను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్,మున్సిపల్ కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,కాంగ్రెస్ నాయకులు అల్లే పురుషోత్తం, సుధ వేణి మురళి గౌడ్,అనుమండ్ల తేజ,కాశ వేణి రాజేష్,గట్టు నవీన్,పడిగెల నరసింహ, కొత్తపెల్లి అరవింద్, శ్రీరాముల సాయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### జగిత్యాలలో

## భక్తిశ్రద్ధలతో దేవి ఆరాధనోత్సవం



### మహిళలు ఓడిబియ్యం సమర్పణ, ప్రత్యేక పూజలు

**జగిత్యాల ప్రతినిధి,జూలై 24 :** ఆషాడ మాసం పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని పురానిపేట శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం దేవి ఆరాధనోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆషాడంలో అమ్మవారిని ప్రత్యేకంగా పూజించే ఆచారం మేరకు ఆలయంలో ఉదయం నుంచే భక్తుల రద్దీ కనిపించింది. మహిళలు సంప్రదాయ వస్త్రాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఓడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఓడిబియ్యం నైవేద్యం సమర్పించి సుమంగళులు అమ్మవారి ఆశీస్సులు కోరారు.ఆలయ ప్రాంగణం భజనలు, నామస్మరణలతో మారుమోగింది. ఆలయ అధ్యక్షులు కొత్త ప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో బట్టు సుజాత, చెట్ల జానకి,నల మాస్ గంగాధర్, కొయ్యడ రమేష్, శైలజ, దీప తదితర మహిళలు, భక్తులు పాల్గొన్నారు.ఆలయ అర్చకులు శ్రీరామ్ శర్మ వేద మంత్రాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

# మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చీరలకు పంపిణీ

### -మధురమ్మ ట్రస్టు నిర్వాహకుల ఔదార్యం




**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జులై 24 :** హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ స్థానిక మున్సిపల్ కార్యాలయం లో పనిచేస్తున్న 54 మంది మహిళ పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం చీరలను పంపిణీ చేశారు. ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ చీరలను మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, మున్సిపల్ కౌన్సిలర్స్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సుహాసిని మాట్లాడుతూ తమ తల్లి పేరుపై ట్రస్ట్ ఏర్పాటు చేసి రిటైర్ అయిన తర్వాత కూడా పెన్షన్ డబ్బులను సమాజంలోని పేదలకు అనేక సేవా కార్యక్రమాలకు ఉపయోగించడం గొప్ప విషయం అని ఇలాంటి వారు సమాజంలో అరుదుగా ఉంటారని అన్నారు.మధ్యాహ్నం వంట కార్మికులకు, స్కావెంజర్లకు, పారిశుద్ధ కార్మికులకు, సమాజంలోని పేదలకు చీరలు పంపిణీ చేయడం, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమని తెలిపారు.ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి వెన్నెముక లాంటి వారని, ప్రతిరోజు వేకువ జాము నుండి వీధులను, డ్రైనేజీలను శుభ్రపరుస్తూ ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి అంటువ్యాధులు రాకుండా కాపాడే సేవలు అమూల్యమని, ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ కార్మికులకు ఏం చేసినా తక్కువేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్ సునీత, సింధుజ, సమ్మయ్య, సుమలత, శ్రీలేఖ, భారతి,జమదగ్ని, అబ్దుల్ హాలీం, రొంటాల బుచ్చయ్య, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# తాత ఆశయాలను కొనసాగిస్తా...

### -ప్రజలకు మరింత సేవ చేస్తా
### -కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జులై 24 :** రాజ్యసభ సభ్యుడిగా ప్రభుత్వం క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు ఆనాటి భారత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కు చేదోడువాదోడుగా ప్రభుత్వాన్ని నిలబెట్టడంలో కీలక కృషి చేసిన దివంగత నేత వొడితల రాజేశ్వర్ రావు అని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా స్థానిక పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ప్రణవ్ నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి రాజేశ్వర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్ష ఉండకూడదని విద్యాసంస్థలను నెలకొల్పి వారికి ఉచిత విద్యను అందించారని, ఈ ప్రాంత బిడ్డగా నియోజకవర్గ అభివృద్ధి పనులు రాజ్యసభ సభ్యుడిగా చేశారని, ఇప్పటికీ వారి అభివృద్ధి ఆనవాళ్లు ఇంకా ఉన్నాయని అన్నారు. ఆయన చూపిన బాటలో ప్రజలకు మరింత సేవ చేస్తానని ప్రణవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, వైస్ చైర్మన్ అంజలి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం

### -బి ఆర్ ఎస్ నేతల మండిపాటు
### -హుజురాబాద్ లో బంద్ విజయవంతం



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జులై 24 :** ప్రజా సమస్యల పరిష్కారం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమయ్యాయని బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు.బిఆర్ఎస్ ఇచ్చిన పిలుపుమేరకు హుజురాబాద్లో శుక్ర వారం బంద్ పాటించారు.ఈ సందర్భం గా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ .. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను తీవ్రంగా ఎండగట్టారు. కేంద్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే.. మతం పేరుతో ఎండగడుతున్నారని, హిందూ మత ద్రోహులుగా, సంఘవిద్రోహ శక్తులుగా ముద్ర వేస్తున్నారని విమర్శించారు.సమస్యలపై సమాధానం చెప్పకుండా..మత విద్వేషాలు రెచ్చ గొడుతున్నారని విమర్శించారు. ఒకవైపు అమెరికా ఆస్ట్రేలియా చైనా రష్యా జపాన్ యూరప్ దేశాలు అభివృద్ధి సాధించి శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా ఉంటే.. మనదేశంలో మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం దురదృష్టకరమని అన్నారు.బిజెపి కుట్రల ను ప్రజలు ఇప్పుడిప్పుడే గమనిస్తున్నారని అన్నారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరుగుతున్న అణచివేతకు నిరసనగా కేటీఆర్ తన జన్మదిన వేడుకలను నిరాడంబరంగా నిర్వహిస్తూ వారికి సంఘీభావం ప్రకటించడం ఆయన ప్రజాస్వామ్య విలువల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కును అణచివేయడం తగదని, కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు అందాల్సిన సాగునీటిని విడుదల చేయాలని,ప్రస్తుత వానాకాల సాగు దృష్ట్యా రైతులకు యూరియా ఎరువుల ను ఎలాంటి కొరత లేకుండా సకాలం లో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.సాగునీరు,యూరియా సకాలం లో అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

**హుజురాబాద్లో కేటీఆర్ జన్మదిన వేడుకలు**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) గారి 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద స్థానిక బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి కేటీఆర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ గారు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధిక శ్రీనివాస్ గారు, మాజీ పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్ గారు, కౌన్సిలర్లు తార తిరుమల్ రెడ్డి, లావణ్య, బండ నరేష్, సర్పంచులు కట్కూరి మల్లారెడ్డి, జూపాక వెంకటేష్, ఉప సర్పంచ్ సతీష్, మాజీ కౌన్సిలర్లు అపరాధ ముత్యం రాజు, డిష్ కుమార్, తాళ్లపెల్లి శ్రీనివాస్, ఇమ్రాన్, కొండ్ర నరేష్, కోయడ కమలాకర్, నాయకులు పోరెడ్డి శంతన్ రెడ్డి, ఐలయ్య, మైకేల్, కానీగంటి శ్రీనివాస్, రమేష్, రేణుక, ప్రభావతి రెడ్డి, పంజాల శ్రీధర్, కొలిపాక సమ్మయ్య, శివ కిరణ్, పిల్లి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన కాంగ్రెస్ నాయకులను సన్మానించిన వైస్ చైర్మన్



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జులై,24 :** నిర్మల్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ టౌన్ ప్రెసిడెంట్గా ఎన్నుకోబడిన ఎర్ర రాహుల్ ను మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్గా కత్తి సురేష్ ని ఈ రోజు నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల.గణేష్ చక్రవర్తి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింతగా చూరగొంటారని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కత్తి నరేందర్, అడప.పోశెట్టి,నాయకులు కత్తి నితీష్, మూట సురేష్ మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు


# చేనేతను ఆదుకుంటాం

### -కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జులై 24 :** చేనేత ఉత్పత్తులను పెంచడం ద్వారా చేనేత వృత్తుల వారికి చేయూత ఇస్తున్నామని నియోజకవర్గ వ్యాప్తంగా చేనేత కార్మికులను ఆదుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సమీకృత వస్త్రోత్పత్తి కేంద్రాన్ని ప్రణవ్ సందర్శించారు.ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని సన్మానించారు.కేంద్రంలో జరుగుతున్న పనులను,దినసరి వేతనం గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు, జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు సదానందం,సంఘం అధ్యక్షుడు ఉపేందర్,ఉపాధ్యక్షులు తిరుపతయ్య,కోశాధికారి మహదేవ్,సభ్యులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కురుమ కులస్తులు ఆధ్వర్యంలో బోనాలు



**చురకలు విలేఖరి వీణవంక జులై 25 :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వీణవంక మండల కేంద్రంలోని కురుమ కులస్తులు తమ కులదైవమైన శ్రీ బీరప్ప స్వామి వారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఒగ్గుడొల్ల చప్పుళ్లు, సాంప్రదాయ వాయిద్యాల నడుమ మహిళలు బోనాలు సమర్పిస్తూ గ్రామవీధుల గుండా ఘనంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా భక్తులు శ్రీ బీరప్పస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,గ్రామంలో సుఖశాంతులు,సుభిక్షం ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కురుమ కులస్తులు,మహిళలు,యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు.

## ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు పై గ్రామ సభ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూలై 24 :** ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ పంచాయతీ లో ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు పై గ్రామ సభ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ గారైన జిల్లా వ్యవసాయ అధికారిని అఫ్జల్ బేగం గారు ఎల్ నినో ప్రభావం వల్ల మండలం లో సాధారణం కంటే 36% లోటు వర్షపాతం నమోదైనట్లు ,వరి నాట్లకు ఇది సరిపోదు కనుక ప్రత్యామ్నాయ పంటలైనా పెసర కంది రాగులు నువ్వులు కూరగాయలు ఆయిల్ పామ్ వంటి పంటల సాగు గురించి వివరించారు,రాగులు నువ్వుల విత్తనాలు TVK నందు అందు బాటులో ఉన్నట్లు రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా MPDO సత్తయ్య గారు మాట్లాడుతూ జల సిరి లో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత , బోర్‌బావి వద్ద రీచార్జ్ స్ట్రక్చర్స్,ఫామ్ పాండ్స్,ఊత కుంటాలను VBGRAM (G) కింద రైతులు నిర్మించుకోవాల్సిందిగా ఇట్టి అవకాశాన్ని అందరూ ఉపయోగించు కోవాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో MRO గారు MAO ,AE మిషన్ భగీరథ,AE ఇరిగేషన్అధికారులు రైతులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**చురకలు విలేఖరి వీణవంక జూలై 24 :** వీణవంక మండల కేంద్రంలో శుక్రవారం బి ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఐటీ శాఖ,బి ఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం హయాంలోనే అన్ని వర్గాలకు అభివృద్ధి జరిగిందనీ అన్నారు.మండల నాయకులు జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముసిపట్ల తిరుపతి రెడ్డి, మాడ సాధవరెడ్డి, సిద్ధపల్లి మహిపాల్ రెడ్డి,సర్పంచులు మండల కుమార స్వామి,తిరుపతి గౌడ్, పాల్గొన్నారు.

## హరిదాసు నగర్లో బోర్ వేల్ రీ ఛార్జింగ్ ఫిటు పనుల ప్రారంభం

**-ఎంపీవో ఉమాశంకర్ చే మార్కింగ్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 24 :** ఎల్లారెడ్డిపేట మండలం హరిదాసు నగర్ గ్రామంలో బోర్వేల్ రీ ఛార్జ్ ఫిట్ పనులను మండల ఎంపీవో ఉమశంకర్,సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్‌లు ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీవో ఉమశంకర్ మాట్లాడుతూ బోర్వేల్ రీచార్జ్ పనుల ద్వారా గ్రౌండ్ లెవెల్ వాటర్ పెరుగుతుందని తెలిపారు.సర్పంచ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగొంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమములో గ్రామపంచాయతీ సెక్రెటరీ రమేష్,ఏఈఓ సాయి వైష్ణవి, రవి,జలపాతిరెడ్డి,జాకిర్,తదితరులు పాల్గొన్నారు.

# అక్షర యోధుల ఆపద్బాంధవుడు..అండగా నిలిచే 'ఆధ్యుడు'

**-నేడు టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా జన్మదినం**

**-జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతర పోరాటం**

**-సమాజ సేవలో విశిష్ట ముద్ర**

**-నాయకత్వకానికి ఆదర్శంగా నిలిచే నేతగా ప్రశంసలు**



**చురకలు విలేఖరి, వేములవాడ, జూలై 24 :** పదవిని ప్రతిష్ఠగా కాకుండా బాధ్యతగా భావించినప్పుడు నాయకత్వానికి అసలైన అర్థం తెలుస్తుంది.జర్నలిస్టుల సమస్యను తన సమస్యగా స్వీకరించడం,ఆపదలో ఉన్న సహచరులకు ధైర్యంగా అండగా నిలవడం,సంఘ బలోపేతం కోసం నిరంతరం శ్రమించడం,ప్రజా సమస్యల ను నిర్భయంగా వెలుగులోకి తీసుకు రావడం,సమాజ సేవలో ముందుండడం ఈ లక్షణాలన్నింటినీ తన వ్యక్తిత్వంలో మేళవించుకున్న గొప్ప నాయకుడు టీయూడబ్ల్యూజే లాయక్ పాషా.ఈ సందర్భంగా శనివారం ఆయన జన్మదినం పురస్కరించుకొని జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయులు, యూనియన్ నాయకులు,ప్రజాప్రతి నిధులు,సామాజికవేత్తలు,అభిమానులు ఆయనను హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్,ఆంధ్రప్రభ స్టాఫ్ రిపోర్టర్ అయిన లాయక్ పాషా ప్రస్తుతం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) జాతీయ కౌన్సిల్ సభ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు,జిల్లా అధ్యక్షుడు,జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు, వేములవాడ ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడి గా పలుకీలక బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తున్నారు.

**జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం**

జర్నలిస్టు కుటుంబానికి ఏ కష్టం వచ్చినా ముందుగా స్పందించడం లాయక్ పాషా ప్రత్యేకత.ముఖ్యంగా జర్నలిస్టులకు ప్రమాదాలు,అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు,వృత్తిపరమైన సమస్యలు,ఏ పరిస్థితి ఎదురైనా సహచరులకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటారు. మీడియా అకాడమీ ద్వారా అందే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి జర్నలిస్టుకు చేరేలా స్వయంగా పర్య వేక్షించడం ఆయన సేవా నిబద్ధతకు నిదర్శనం.

**ఆపదలో భరోసా... కష్టకాలంలో చేయూత**

ఇటీవల అకాల మరణం చెందిన టీవీ9 రిపోర్టర్ గారదాసు ప్రసాద్ కుటుంబానికి అవసరమైన పత్రాలను సిద్ధం చేయించి సంక్షేమ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవడం ఆయన మానవీయ దృక్పథాన్ని చాటింది.బాధలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా నిలిచిన తీరు జర్నలిస్టు సమాజం ప్రశంసలను అందుకుంది.

**సంఘాన్ని బలోపేతం చేసిన సమన్వయ కర్త**

జిల్లాలోని ప్రతి మండలానికి యూనియన్ కార్యకలాపాలను విస్తరించి సభ్యత్వ నమోదును విజయవంతంగా నిర్వహించారు.యువ జర్నలిస్టుల్లో సంఘ చైతన్యాన్ని పెంపొందిస్తూ, వేములవాడలో జిల్లా మహాసభను ఘనంగా నిర్వహించి మూడు జిల్లాల నాయకత్వాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడం ఆయన సమర్థ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచింది.

**ప్రజల పక్షాన కలం...సమాజం కోసం సేవ**

ప్రజా సమస్యలను కథనాల రూపంలో వెలుగులోకి తీసుకురావడమే కాకుండా వాటి పరిష్కారం కోసం అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజలకు వారధిగా నిలుస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ,చెట్ల పెంపకం, పరిశుభ్రత కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లోచురుగ్గా పాల్గొంటూ సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

**రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రయోజనం**

ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా భావిస్తూ వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేస్తున్నారు.విభేదాలకు అతీతంగా ప్రజా ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగే నాయకత్వం ఆయన ప్రత్యేకత.

**'ఆపదలో ఆదుకునే అన్న'గా చిరస్థాయి గుర్తింపు**

"సంఘం అంటే పదవి కాదు... సేవ" అనే భావనతో నిరంతరం శ్రమిస్తున్న లాయక్ పాషా జర్నలిస్టుల హక్కులు,గౌరవం,సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్నారు.అందుకే సహచర పాత్రికేయులు ఆయనను ప్రేమగా "ఆపదలో ఆదుకునే లాయక్ భాయ్",అక్షరయోధుల ఆపద్బాంధవుడు",జర్నలిస్టుల నాయకుడు"గా అభివర్ణిస్తుంటారు.వృత్తి విలువలను కాపాడుతూ సేవా స్ఫూర్తిని చాటుతూ యువతకు మార్గదర్శకుడిగా, సహచరులకు ధైర్యంగా అండగా నిలుస్తున్న లాయక్ పాషా మరెన్నో విజయ శిఖరాలు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో ప్రజాసేవను మరింత విస్తరించాలని జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా పాత్రికేయులు, యూనియన్ నాయకులు,అభిమానులు హృదయ పూర్వకంగా ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

### స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో పాల్గోనని

# గాడ్గేలు మీరు గాంధేయ వాదులు కాదు

**-నీట్ పరీక్ష లీకుకు నైతిక బాధ్యత వహించి దర్మేంద్ర తన మంత్రి పదవికి**

**-రాజీనామా చేయాలి సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 24 :** భారతదేశ స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో పాల్గోనని గాడ్గేలు మీరు గాంధేయ వాదులు కాదని సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామంలో పిట్ల వంశీ అనే యువకుడు ఆత్మ హత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు,వారి తల్లిదండ్రులకు తీరని లోటు అన్నారు కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.ఈ దేశంలో పెద్ద ఎత్తున జరుగుతున్న నిరసనలకు చదువుకున్న యువకుడు వంశీ చలించిపోయి తన చావుకు మోడీ కారణమని ఆత్మహత్య చేసుకున్నాడంటే మనం అర్థం చేసుకోవాలన్నారు.దీన్ని కొంతమంది రాజకీయ రంగు పులమడానికి ఎదురుదాడి చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు.భారతదేశ చరిత్రలో ఏక్కడ లేని విదంగా 12 సంవత్సరాల బిజెపి ప్రభుత్వంలో 152సార్లు పేపర్ లీక్ అయిందన్నారు.భారత పౌర సమాజం విద్యార్థులు వారి తల్లిదండ్రులు లక్షలాది మంది మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారని దానికి నైతిక భాద్యత వహించి రాజీనామా చేయాలన్నారు.భారత ప్రధాని మోడీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నవ్విపోదురు గాక నాకేమీ సిగ్గు అన్న చందంగా,,,,, వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.దేశ చరిత్ర లో ఏక్కడ లేని విదంగా విద్యార్థులపైన పైశాచికంగా పోలీసులతో లాఠీచార్జి చేయించిన సంఘటన మన మందరం చూశామని ప్రజాస్వామ్యాన్ని పౌర సమాజాన్ని కాపాడడానికి ప్రతిపక్ష నాయకునిగా కాంగ్రెస్ పార్టీ పక్షానా రాహుల్ గాంధీ ప్రధాని ఇంటి ముందు ధర్నా చేయడం తప్పేమీ కాదన్నారు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి ఎంపిగా ఉండి రాష్ట్ర ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఇంటిని ముట్టడించాలని పిలుపునివ్వడం సిగ్గుండాలే అనిఅన్నారు.భారత సమాజం బిజెపి ప్రభుత్వానికి త్వరలో బుద్ది చెబుతుందన్నారు.ఇకనైనా ప్రజాస్వామ్య బద్ధంగా నడుచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పిట్ల వంశీ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామన్నారు.వారి తల్లిదండ్రులను ఆయన ఓదార్చారు కొంత ఆర్థికసహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గుండాడిరాంరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య మాజీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి షేక్ గౌస్, సర్పంచులు బాపురెడ్డి సిర్రం నాగరాజు యాదవ్ జజ్జరి దేవేందర్ మేతే మధుసుదన్ రెడ్డి వంగ గిరిధర్ రెడ్డి,బండారి బాల్రెడ్డి మేండే శ్రీనివాస్ యాదవ్ మాదాసుబాబు మల్లారెడ్డి దేవయ్య దండు శ్రీనివాస్ముదిరాజ్ రవి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు 15శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలి

**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 24 :** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి కిరణ్ సూచనల మేరకు, తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో దళితులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ, భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కలెక్టర్కు వినతి పత్రం సమర్పించినట్లు జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం సామాజిక న్యాయం, సమానత్వం, బలహీన వర్గాల సాధికారతను ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని దళిత జనాభాకు అనుగుణంగా



రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైన చర్య అని అన్నారు. దళితులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించడం ద్వారా వారి సమస్యలు శాసనసభలు, స్థానిక సంస్థలు మరియు ఇతర ప్రజాప్రతినిధుల వేదికల ద్వారా సమర్థవంతంగా ప్రభుత్వ దృష్టికి చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. సామాజిక న్యాయం బలోపేతానికి, ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలకు సముచిత భాగస్వామ్యం కల్పించేందుకు దళితులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయడం అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుని, రాబోయే ఎన్నికల్లో దళితులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేసే దిశగా నిర్ణయం తీసుకోవాలని, ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేలా జగిత్యాల జిల్లా కలెక్టర్ తమ వంతు సిఫార్సు చేయాలని వినతి పత్రం ద్వారా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, కొత్తూరి బాబు, బన్న సంజీవ్, తడగొండ అంజయ్య, దుర్గం రమేష్, కొత్తూరి అంజయ్య, దేవి సంతోష్, ఉయ్యాల స్వామి, సట్ట రవి రాజు, కొదురుపాక అశోక్, కె లక్ష్మణ్, గిరిమళ్ల రఘు, మంత్రి నాగరాజు జిత్తవేణి శివకుమార్ తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, జూలై 24 :** మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ అన్నారు.మండలంలోని వేంపేట్ గ్రామంలో మహిళా సర్పంచ్ ప్రవీణ్ ఆధ్వర్యంలో గ్రామసభ ఘనంగా నిర్వహించగా మహిళా సాధికారత, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మహిళల ఆరోగ్యం, బాలికల విద్య,పోషకాహారం, పరిశుభ్రత,మహిళల భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నరు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో




ఉండాలని, మహిళా సాధికారతే సమాజ అభివృద్ధికి బలమైన పునాదని,ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. మహిళా సంఘాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడం, పొదుపు అలవాటు పెంచుకోవడం, కుటుంబ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గ్రామ మహిళల సమస్యలను తెలుసుకొని,వాటి పరిష్కారానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని సర్పంచ్ ప్రవీణ్ హామీ ఇచ్చారు. గ్రామ మహిళలకు పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించి,ప్రతి ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరుతూ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి, కార్యదర్శి రాజు, అంగన్వాడీ టీచర్స్, మహిళా సంఘాల సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 24 :** బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఇట్టేడి రాజు ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో ఫీజు బకాయి - బీజేపీ లడాయి పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇట్టేడి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్కాలర్షిప్ల జాప్యం, ప్రభుత్వ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దురిశెట్టి మమత, సర్ జిల్లా కన్వీనర్ పుప్పాల శ్రీనివాస్, జగిత్యాల టౌన్ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్, జిల్లా కార్యదర్శి సుదవేని మహేష్, జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, పార్లమెంట్ కో-కన్వీనర్ గుంటూక సదాశివ్, బీజేపీ జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, బీజేవైఎం నాయకులు పూదరి పవన్, ధీటి వెంకటేష్, పందిరి నాగరాజు, వాకిటి తిరుపతి రెడ్డి, ఐటీ సెల్ కన్వీనర్ పిస్క రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో...

# కోతుల పట్టివేత విజయవంతం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై, 24 :** ఈ రోజు నిర్మల్ పట్టణంలోని (వార్డ్ నెం.16) ఆదర్శనగర్ వశిష్ట హైస్కూల్ లో కోతుల పట్టివేత కార్యక్రమం విజయవంతంగా సాగింది. నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్ వశిష్ట హైస్కూల్,పలు కాలనీలలో నిర్వహించిన ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమంలో మొత్తం 40 కోతులను పట్టుకొని రంగులు చల్లి కవ్వాల్ అటవీ ప్రాంతానికి సురక్షితంగా తరలించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోతుల సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో స్థానిక కౌన్సిలర్ రావులవార్. విట్టల్ సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ మరియు నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీరామోజీ రాజు, కల్లెం సత్యనారాయణ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

# బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 24 :** పెద్దపల్లి బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్వర్యంలో నీట్ పేపర్ లికేజీ, ఢిల్లి జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులపైన జరిగిన లాఠీ చార్జ్ ని ఖండిస్తూ , శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జోనల్ ఇంచార్జ్ వరికిల్ల మల్లేష్ మాట్లాడుతు కేంద్రం ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నది అని, చేతకాని బిజెపి ప్రభుత్వం ప్రధాని మోది తక్షణమే రాజీనామ చెయలని అన్నారు, విద్యార్థుల పైన జరిగిన లాఠిచార్జ్‌ని తీవ్రంగా ఖండిస్తూ, విద్యార్థులకు సిజెపి కి బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షురాలు బెహన్ కుమారి మయవతి సంపూర్ణ మద్దతును తెలియజేసారు అన్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇంచార్జ్ క్యాదసి రవిందర్ ,జిల్లా ఉపాధ్యక్షులు నర్ల గోపాల్ యాదవ్,కోశాధికారి పులిపాక బోందాలు,జిల్లా కార్యదర్శి నక్కతిరుపతి,పెద్దపల్లి నియోజకవర్గఅధ్యక్షులు బోంకురి దుర్గయ్య,మంథని ఇంచార్జ్ జనగామ రవికుమార్,రామగుండ ఇంచార్జ్ జింక ఉదయ్ ,అధ్యక్షులు జనగామ లింగయ్య,జిల్లా మహిళ కన్వీనర్ కాంపెల్లి అనిత,పెద్దపల్లి అసెంబ్లి ఉపాధ్యక్షులు బోయిని రంజిత్ ,ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్,కోశాధికారి మల్లరపు రవిందర్ ,పెద్దపల్లి నియెజక వర్గ మహిళ కన్వీనర్ కల్వల శోభ,పట్టణ అధ్యక్షురాలు రామిళ్ళ శారద,నాయకులు పల్లె సుమన్,ఏల్లశ్వామి,రఘువీర్,సురేష్,మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో హే చికితా సినిమా సందడి



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 24 :** జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన నగునూర్ లచ్చక్క పేట గ్రామానికి చెందిన ధనరాజ్ లెక్కల × దర్శకత్వంలో నిర్మించిన హే చికితా చిత్రం తెలంగాణ వ్యాప్తంగా థియేటర్ల లో శుక్రవారం నాడు విడుదలై జగిత్యాల బాలాజీ టాకీస్ లో విడుదలైన సందర్భంగా దర్శకుడు ధనరాజ్ లెక్కల మిత్రులు టాకీస్ ముందు బాణాసంచా కాల్చి, స్వీట్ పంపిణీ చేసి సందడి చేశారు. రైతు సమస్య ఇతివృత్తంగా నిర్మించిన చిత్రాన్ని జగిత్యాల జిల్లా వాసులు తిలకించాలని కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల అధినేత గుండేటి రాజు, టాకీస్ యాజమాని పుల్లయ్య పిలుపునిచ్చారు. ఈ చిత్రంలో జగిత్యాల జిల్లా కు చెందిన కళాకారులు అంజి మామ, ముక్కు అజయ్, పోలీస్ మల్లన్న, మమత దేశవేని, మయూరి, గెటప్ శ్రీనివాస్ చారి, రాపర్తి రవి, రామన్న పేట రాజన్న తదితరులు నటించారు. ఈ కార్యక్రమంలో యువ దర్శకుడు లైలెట్టి ప్రవీణ్, రాజా రామ్ మోహన్ రెడ్డి, ఆకుల వెంకటేష్ గౌడ్, ప్రదీప్ వొల్లాల తదితరులు పాల్గొన్నారు.

# సమాన పనికి సమానవేతనం ఇవ్వాలి

**-జిల్లా టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు భూమేశ్వర్**



**చురకలు విలేకరి, మల్లాపూర్, జూలై 24 :** సమాన పనికి సమాన వేతనం చెల్లించి, సర్వీస్ రెగ్యూలరైజేషన్ చేయాలని, మినిమం టైం స్కేల్ ఇంప్లిమెంట్ చేయాలని, 29 రోజుల సమ్మెకాలం వేతనం చెల్లించి తదితర సమస్యలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపడుతున్నట్లు జిల్లా టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు అంబటి భూమేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, సమగ్ర శిక్షణలో పని చేస్తున్నటువంటి సిబ్బంది పోస్టు కార్డు ఉద్యమంలో భాగంగా సాయంత్రం సమయంలో రాసిన ఉత్తరాలను సేకరించి పలు డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు ఉద్యమం కొనసాగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నరేష్, నిరంజన్, కేజీబీవీ ఎస్ఓ శ్రీలత, ఉపాధ్యాయులు ప్రతాప్చారి, నరేష్, మహేష్, దేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అగ్నివీర్ ఇంటర్వ్యూ ఉంది..అబుదాబి నుంచి రప్పించండి

**-'సీఎం ప్రవాసీ ప్రజావాణి' ని ఆశ్రయించిన యువకుడి తల్లి**

**-గల్ఫ్ యజమాని వదిలిపెడితేనే... సైనికుడిగా అవకాశం**

**-వీసా రద్దు, వాపస్ పంపడానికి 1.08 లక్షల జరిమానా**






**చురకలు విలేఖరి,జగిత్యాల, జులై, 24 :** భారత సైన్యం నిర్వహిస్తున్న 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఎంపిక ప్రక్రియలో పాల్గొనేందుకు వీలుగా తన కుమారుడిని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబి నుంచి అత్యవసరంగా స్వదేశానికి రప్పించాలని కోరుతూ ఓ తల్లి 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' ని ఆశ్రయించారు.జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పాత గూడూరు గ్రామానికి చెందిన కొప్పర్తి అభిలాష్ జగిత్యాలలోని లైసెన్సు కలిగిన ఒక గల్ఫ్ రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా టూరిస్ట్ వీసాపై ఈ నెల 8న ముంబయి నుంచి అబుదాబి కి వెళ్లారు. అనంతరం ఈ నెల 13న అతనికి ఎంప్లాయిమెంట్ వీసా జారీ అయింది. ఇదే సమయంలో భారత సైన్యం నిర్వహిస్తున్న 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ లో భాగంగా నిర్వహించే ఫిజికల్ స్క్రీనింగ్ (దేహదారుఢ్య పరీక్ష) కు షార్ట్‌లిస్ట్ అయినట్లు అతనికి ఈ నెల 14న ఇ-మెయిల్ అందింది.అయితే, ప్రస్తుతం పనిచేస్తున్న కంపెనీ యాజమాన్యం 4,100 యూఏఈ దిర్హాములు (సుమారు 1.08 లక్షలు) జరిమానా చెల్లించి వీసా రద్దు చేస్తేనే భారత్‌కు పంపిస్తామని షరతు విధించిందని, రిక్రూటింగ్ ఏజెంట్ కూడా అదే విషయాన్ని చెబుతున్నాడని అభిలాష్ తల్లి సుమలత వాపోయారు. తన కుమారుడు అగ్నివీర్ ఎంపిక ప్రక్రియలో పాల్గొనేందుకు వీలుగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని అతడిని అత్యవసరంగా అబుదాబి నుంచి స్వదేశానికి రప్పించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్ బేగంపేట ప్రజా భవన్‌లో నిర్వహించిన 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' లో వినతిపత్రం సమర్పించారు.తన కుమారుడు భారత సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలనే చిరకాల స్వప్నం నెరవేరేలా సహాయం చేయాలని సుమలత, 'సీఎం ప్రజావాణి' స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన, పేద కుటుంబానికి చెందిన యువకుడికి తగిన సహాయం అందించి అత్యవసరంగా స్వదేశానికి రప్పించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (జీఏడీ)కి లేఖ రాశారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి బాధిత కుటుంబానికి మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' హెల్ప్‌డెస్క్ లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి, వాలంటీర్ గంగుల మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుపారీ హత్య కేసు ఛేదన..

# అంతర్రాష్ట్ర గ్యాంగ్ అరెస్ట్



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై, 24 :**

నిర్మల్ జిల్లాలో సంచలనం సృష్టించిన అస్లాం ఖాన్ హత్య కేసును నిర్మల్ పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ. జానకి షర్మిల ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందాలు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా విశ్లేషణ ఆధారంగా అంతర్రాష్ట్ర సుపారీ గ్యాంగ్‌కు చెందిన నిందితులను అరెస్ట్ చేశాయి. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన స్కార్పియో కారు, మోటార్‌సైకిల్, రెండు కత్తులు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నాయి.ఈ కేసు ఛేదనలో విశేష కృషి చేసి, కీలక సమాచారాన్ని అందించి దర్యాప్తుకు సహకరించిన భైంసా ఏఎస్పీ శ్రీ సాయి కిరణ్, ముథోల్ సీఐ శ్రీ రవీంద్ర నాయక్, లోకేశ్వరం ఎస్సై శ్రీ అశోక్, కుబీర్ ఎస్సై శ్రీ కృష్ణారెడ్డి లను జిల్లా ఎస్పీ. జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సమన్వయం, అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆమె సూచించారు

# తొలి ఏకాదశి పర్వదినం

**- నేటి నుంచి చాతుర్మాస్య దీక్షలు ప్రారంభం**

**- ఆలయాల్లో పూజలు, వ్రతాలు ప్రారంభం**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (24) :** ఆషాడ శుద్ధ ఏకాదశి తొలి ఏకా దశి పర్వదినాన్ని శనివారం జరుపుకోనున్నారు. ఏకాదశికి పండుగలు ఎత్తుకుని, ఉగాదితో ఉడుగుతాయి అనే నానుడి ప్రకారం తొలి ఏకాదశి నుంచే పండుగలు ప్రారంభమవుతాయి. ఏకాదశి వ్రతంలో ముఖ్యమైంది ఉపవాసం. ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగా జరుపుకుంటారు. శయన ఏకాదశిగా పిలిచే ఈ రోజు పాలకడలిలో శ్రీమన్నారాయ ణుడు శయనించి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేలుకొంటాడని శాస్త్రాలు చెబుతున్నాయి. చా తుర్మాస్య దీక్షల్లో భాగంగా గృహస్తులు, స్వామీజీలు, యతీశ్వరులు, పీఠాధిపతులు 4 నెలలకు పైగా దీక్షలో ఉంటారు. చాతుర్మాస్య దీక్షలు అనేక నియమాలతో కూడి ఉండడం విశిష్టత. దక్షిణాయణ పుణ్యకాలంలో తపస్సు, జపాలకు, దానము చేయుటకు ప్రశస్తి కలిగి ఉంటుంది. కావున ఈ దక్షిణాన పర్వకాలము మానవులలో భగవత్ సంబంధిత జపము ఆచరించుటకు అనువైన కాలం. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశిలలో తొలి ఏకాదశికి విశిష్టత ఉంది. ఈ మాసం, వాతావరణం తొలకరి ప్రారంభంతో వర్షాలు కురిసి పంటలకు అను కూలంగా మారుతాయి. దైవానుగ్రహానికి, పండుగల ప్రారంభానికి కారణమైన ఈ రోజున ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హవనాలు. నిర్వహిస్తారు.నదీ స్నానాలు, పుణ్యక్షేత్ర దర్శనాలు,వ్రతాలు, దాన ధర్మాలు ఆచరిస్తారు. ఇళ్లలో పిండి వంటల విందులు, కబుర్లతో కాల క్షేపం చేస్తారు. రైతులు వేడుకగా జరుపుకునే ఈ ఏకాదశినే పూర్వం సంవత్సరారంభంగా పరిగ ణించేవారు.ప్రకృతి వైపరీత్యాలు రావద్దని, పంటలకు తెగుళ్లు సోకవద్దని రైతులు ప్రార్థిస్తారు.

**దక్షిణాయనం పుణ్యకాలం ప్రారంభం..**

తొలి ఏకాదశి నుంచి దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభం అవుతుంది. దేవతలకు రాత్రి సమయమని భావించే ఈ కాలంలో వచ్చే తొలి ఏకాదశి రోజు శయనించిన శ్రీ మహా విష్ణువు తిరిగి కార్తిక శుద్ధ ఏకాదశి నాడు యోగనిద్ర నుంచి మేల్కొంటాడని స్కాందపురాణం ద్వారా తెలుస్తోంది.

**దక్షిణాయన పుణ్యకాలం అంటే....**

మకర సంక్రాంతి నుంచి నాలుగు నెలల పాటు కొనసాగిన ఉత్తరాయణం పూర్తి అయి ఇక్కడ నుండి దక్షిణాయనం ప్రారంభం అవుతుంది. ఇప్పటివరకు ఉత్తర దిక్కుగా ప్రయాణించిన సూర్యుడు, ఈ రోజు నుంచి దక్షిణ దిక్కు వైపుకు ప్రయాణం సాగిస్తాడు. ఉత్తరాయణం కంటే దక్షిణాయనంలో పండుగలు, పర్వదినాలు ఎక్కువగా వస్తాయి. వాతావరణంలో మార్పులు అధికంగా సంభవిస్తాయి. కాబట్టి ఈ కాలంలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. అందువల్ల ఈ కాలంలో పెద్దలు వ్రతాలు, పూజలు ఆచరించాలని నిర్దేశించారు. ఉపవాసాలు, పూజల పేరిట పాటించే నియమాలలో గొప్ప ఆరోగ్య సూత్రాలు ఇమిడి ఉన్నాయి.

**తొలి ఏకాదశి రోజున విష్ణుమూర్తిని ఇలా పూజించాలి...**

తొలి ఏకాదశి విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైనది. ఈ పర్వదినం రోజున ఉదయాన్నే తలారా స్నానం చేసి శ్రీ లక్ష్మీ నారాయణులను భక్తి శ్రద్ధలతో పూజించాలి. ఉండగలిగిన వారు రోజంతా ఉపవాసం ఉంటే మంచిది. పూజా మందిరాన్ని శుభ్రం చేసుకుని గంధం కుంకుమలతో శ్రీలక్ష్మీనారాయణుల విగ్రహాలను అలంకరించాలి. తొలి పండుగ కాబట్టి ఇంటి గుమ్మానికి మామిడి తోరణాలు కట్టుకుంటే మంచిది. ఆవునేతితో దీపారాధన చేసి, పసుపు రంగు పువ్వులతో, తులసి దళాలతో, అక్షింతలతో శ్రీమన్నారాయణుని పూజించాలి. పులిహోర, చక్రపొంగలి, కొబ్బరికాయ, అరటిపండ్లు వంటి నైవేద్యాలు సమర్పించాలి.

**ఆలయాలలో ఇలా....**

ఇంట్లో పూజ పూర్తయ్యాక సమీపంలోని విష్ణు ఆలయ దర్శనం చేయాలి. సాయంత్రం వేళ విష్ణు సహస్రనామ పారాయణ చేయాలి. రాత్రంతా భగవన్నామ స్మరణ చేస్తూ, భారత భాగవత కథలు చదువుకుంటూ జాగారం చేయాలి. అనంతరం మరుసటి దినం ద్వాదశి ఘడియలు ప్రవేశించగానే ఒక సద్బ్రాహ్మణునికి భోజనం పెట్టి ఉపవాస దీక్ష విరమణ చేయాలి. ఇలా చేయడం వల్ల సంపూర్ణ ఏకాదశి వ్రతం చేసిన ఫలం వస్తుంది. విష్ణుమూర్తి అనుగ్రహం పరిపూర్ణంగా లభిస్తుంది.

**పితృదేవతల ప్రీతి కోసం పేలాల పిండి...**

ఇక తొలి ఏకాదశి రోజున మరొక విశేషం ఏమిటంటే ఈ రోజున పేలాల పిండిని తప్పక తినాలని అంటారు. పేలాలు పితృదేవతలకు ఎంతో ఇష్టమైనవి. అందువల్ల ఈ రోజు మన పితృదేవతలను గుర్తు చేసుకోవడం మన బాధ్యత. అలాగే ఆరోగ్యపరంగా బయటి ఉష్ణోగ్రతలకు అనుగుణంగా శరీరం అనేక మార్పులకు లోనవుతుంది. గ్రీష్మ రుతువు ముగిసిన తర్వాత వర్ష రుతువు ప్రారంభమయ్యే ఈ కాలంలో శరీరానికి పేలాల పిండి వేడిని కలగజేస్తుంది. అందువల్ల ఈరోజున దేవాలయాల్లోనూ ఇళ్ల వద్ద పేలాల పిండిని ప్రసాదంగా పంచుతారు.

**ఏకాదశి వ్రత మహత్యం....**

పవిత్ర ఆధ్యాత్మిక ముక్తిప్రద దినం తొలి ఏ కాదశి. దీనికే హరి దినమని మరో పేరు ఉంది. ఏకాదశి వ్రతంలో ఉన్న విశిష్టత పద్మపురాణం ద్వారా తెలుస్తుంది. త్రిమూర్తులలో శ్రీహరితో ముడిపడిన ఈ ఏకాదశి మహత్యం గురించి అనేక కథలు కూడా పురాణాల్లో ఉన్నాయి. కష్టాల్లో తలమునకలవుతున్న మానవ జాతిని కాపాడడానికి శ్రీహరి ఈ ఏకాదశిని ఏర్పాటు చేశాడని, వ్రతాన్ని నియమనిష్టలతో ఆచరిస్తే సమస్త వ్యాధుల నుంచి విముక్తి పొందుతారని చెబుతారు.

**ముఖ్య పండగ రోజులివే...**

2026 సంవత్సరంలో తొలి ఏకాదశి (శయన ఏకాదశి) తర్వాత వచ్చే ముఖ్యమైన హిందూ పండుగలు, వ్రతాలు ,25 జూలై 2026తొలి ఏకాదశి (శయన ఏకాదశి),29 జూలై 2026,గురు పూర్ణిమ,09 ఆగస్టు 2026,కామికా ఏకాదశి,16 ఆగస్టు 2026 నాగుల చవితి,18 ఆగస్టు 2026,గరుడ పంచమి,19 ఆగస్టు 2026,వరలక్ష్మీ వ్రతం,20 ఆగస్టు 2026,శ్రావణ శుక్రవారం పూజలు,28 ఆగస్టు 2026 శ్రీకృష్ణ జన్మాష్టమి,03 సెప్టెంబర్ 2026 అజా ఏకాదశి,11 సెప్టెంబర్ 2026 వినాయక చవితి,25 సెప్టెంబర్ 2026 అనంత పద్మనాభ వ్రతం,26 సెప్టెంబర్ 2026 మహాలయ అమావాస్య,15 అక్టోబర్ 2026 బతుకమ్మ ప్రారంభం,20 అక్టోబర్ 2026 దుర్గాష్టమి,21 అక్టోబర్ 2026 మహానవమి,22 అక్టోబర్ 2026 విజయదశమి (దసరా),08 నవంబర్ 2026 దీపావళి,15 నవంబర్ 2026 కార్తీక పౌర్ణమి,25 డిసెంబర్ 2026 వైకుంఠ ఏకాదశి

**తొలి ఏకాదశి తో హిందువుల పండుగలు,వ్రతలు ప్రారంభం**

**నారంభట్ల హరిప్రసాద్ శర్మ...వేద పురోహితులు**

తొలి ఏకాదశి తో హిందూ వుల పండుగ లు ప్రారంభం అవుతాయి. పురణాలు,పంచాంగం ప్రకారం ఈఏడాదిలో వచ్చే 24 ఏకాదశిలలో తొలి ఏకాదశికి విశిష్టత ఉంది.ఆలయాలలో భక్తులు పూజలు చేసి వ్రతాలు ఆచరిస్తారు.ఉపవాసం తో పూజలు చేస్తారు. ఏకాదశి తర్వాత పండుగలు ప్రారంభం అవుతాయి.

